



అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 13 సెప్టెంబర్ 2025 పేజీలు : 04


# పట్టణంలో తాగునీటి సరఫరా మెరుగుకు చర్యలు : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



భూమిపూజ అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## రూ.30 లక్షలతో వ్యయంతో పైపలైన్‌కు భూమి పూజ

**రాయదుర్గం సెప్టెంబర్ 12(ప్రభాతవార్త**

రాయదుర్గం పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. రాయదుర్గం పట్టణంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన తాగునీటి సరఫరా పైప్ లైన్ పనులకు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ... గత ఎన్నికల్లో పట్టణవాసులు తనకు 16వేల భారీ మెజారిటీ ఇచ్చారని గుర్తు చేశారు. తనపై నమ్మకం, విశ్వాసంతో ఇచ్చిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నెరవేర్చడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గత టిడిపి పాలనలో చేపట్టిన రోడ్ల విస్తరణ పనులు, అర్ధాంతరంగా ఆగిన రైల్వే వంతెన పనులు పూర్తితో పాటు మోలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. కనేకల్లు ట్యాంక్ నుండి పట్టణానికి నీటి సరఫరా చేస్తున్న పైప్ లైన్ మరమ్మతులకు మరో రూ.40 లక్షల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. రాయదుర్గంలో నీటిశుద్ధి కేంద్రం నుంచి వాటర్ ట్యాంక్ వరకు కొత్తగా పైప్లైన్ ఏర్పాటు చేస్తుండడంతో మూడు కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందన్నారు. దాంతో పట్టణంలోనీ 30, 31, 32 వార్డుల పరిధిలో తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని సూచించారు. ఇతర పట్టణాలకు ఏమాత్రం తీసిపోని విధంగా రాయదుర్గం పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కురుబ ప్రశాంతి, పద్మజ, నటకశాల హనుమంతు, పోరాళ్ల పురుషోత్తం, గాజుల వెంకటేశులు, కడ్డిపూడి మహబూబ్ బాషా, బండి భారతి, వేణు, వై.వెంకటేశులు, రావుత్ రాజశేఖర, ఎల్లప్ప, బుదురు తిప్పెస్వమి తదితరులు పాల్గొన్నారు.

# అందరి మద్దతుతో అభివృద్ధి సాధించాం

- జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ ఘనంగా వీడ్కోలు పలికిన ప్రజా ప్రతినిధులు అధికారులు



కలెక్టర్ టీఎస్ చేతన్ కు సత్య సాయి చిత్రపటాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి



కలెక్టర్ టీఎస్ చేతన్ కు జ్ఞాపిక అందిస్తున్న రెవెన్యూ అధికారులు

**శ్రీసత్యసాయిజిల్లా, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త ప్రతినిధి**

తన పదవీకాలంలో ప్రజల సహకారం, ప్రజాప్రతినిధులు , అధికారుల మద్దతుతో అభివృద్ధి పనులను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లగలిగానని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలియజేశారు. శుక్రవారం పుట్టపర్తి కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లా ప్రజల ప్రేమ, అభిమానాలు మరువలేనివని, జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని జిల్లా కలెక్టర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో ఉద్యానవనం, పరిశ్రమల ఏర్పాటు, జాతీయ రహదారులు, సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో ఉపాధి అవకాశాలు పెరిగి, జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధురా రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ టీఎస్ చేతన్ వద్ద పనిచేయడం ద్వారా ఎంతో నేర్చుకున్నానని, ఆయన మరికొంతకాలం జిల్లాలో కొనసాగి ఉంటే బాగుండేదని అన్నారు. అభివృద్ధి పనుల విషయంలో కలెక్టర్ అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. మాజీ మంత్రి శ్రీ పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాకు విశేషమైన సేవలు అందించిన కలెక్టర్ టీఎస్ చేతన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాల వరకు పనిచేసి ఉంటే బాగుండేదని, అయితే ఉద్యోగుల బదిలీలు సహజమని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, ఆనంద్ కుమార్, మహేష్, ఇన్‌ఛార్జి డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మైనుద్దీన్, జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యకు పరిష్కారం చూపిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

- 15 లక్షల ఎంపీ లాడ్స్ నిధులతో శుద్ధ త్రాగునీటి కేంద్రం ఏర్పాటు



శుద్ధ త్రాగునీటి కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

**నార్పల సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

సమస్యను తక్షణమే పరిష్కరించాలనే సంకల్పంతో ముందడుగు వేసి శుక్రవారం సింగనమల నియోజకవర్గం లోని నార్పల మండలం గూగూడు గ్రామంలో శుద్ధ త్రాగునీటి కేంద్రం ( ఆర్ ఓ వాటర్ ప్లాంట్) ను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణి ప్రారంభించారు. గూగూడు ప్రజలు తాగునీటి సమస్య గురించి ఎంపీ దృష్టికి తీసుకు రాగా, ఎంపీ వెంటనే స్పందించి ఈ తాగునీటి సమస్యకు పరిష్కరంగా ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎంపీ లాడ్స్ నుండి నిధులు మంజూరు చేసారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గూగూడులో జరిగే జాతర మహోత్సవాలకు రాష్ట్ర మరియు దేశ నలుమూలల నుండి వచ్చే భక్తులకు త్రాగునీటి సమస్య లేకుండా ఈ వాటర్‌ప్లాంట్ ఉపయోగపడుతుందన్నారు. ఎంపీ లాడ్స్ నిధుల ద్వారా రూ. 15 లక్షల రూపాయలను మంజూరు చేసి ఆధునిక సాంకేతికతతో కూడిన ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టి గ్రామస్తులకు త్రాగునీటి సమస్య తీర్చామన్నారు. గ్రామంలో ఈ మధ్యనే ప్రధాన మురుగు నీటి కాలువ సమస్యను పరిష్కారం చేసి, మరో వైపు చెట్లు పెంచే కార్యక్రమాన్ని మొద॑లుపెట్టామ న్నారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ భవనం పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎంపీ గారు తెలిపారు. రూ. 5 లక్షల ఎంపీ నిధులతో త్వరలోనే బస్ షెల్టర్ నిర్మిస్తామన్నారు. రా జ్య సభ సభ్యులు బీద మ స్తాన్ రావు గారి ఎంపీ నిధు లతో ముఖ్య అతిధుల కోసం అతిధి గృహం కొరకు త్వరలోనే భూమి పూజ కార్యక్రమం చేస్తామని తెలి॑ారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే బండారు శ్రావణి శ్రీ మా ట్లాడుతూ. గూగూడులో వెలసిన జంట ఆలయాల దర్శనం కోసం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చే వారికి నీటి సమస్య లేకుండా ఆర్ఓ ప్లాంట్ ద్వారా త్రాగునూరు నీరు ఉచితంగా అందించడం గర్వించదగ్గ విషయం అన్నారు. త్వరలోనే గు గుడు గ్రామాన్ని పర్యటన కేంద్రం గా తీర్చిదిద్దామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగన మల నియో జకవర్గం ద్విసభ్య కమిటీ స భ్యులు ఆలం నరస నాయుడు, మాజీ ఎంపీపీ ఆకుల ఆంజినేయులు, టిడిపి జిల్లా నాయకులు ఆలం వెం కట నర్సా నాయుడు, మరి యు స్థానిక నాయకులు, గూగూడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విపత్తులు, ఆపదల్లో వారిని ఆదుకోవడంలో టిడిపి ముందుంటుంది

- నేపాల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే దగ్గుపాటి



నేపాల్ బాధిత కుటుంబాన్ని పరామ ర్శిస్తున్న ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడు



మంత్రి లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బాధితులు

**అనంతపురం సెప్టెంబరు 12 ప్రభాతవార్త**

విపత్తులు, ఆపదల్లో వున్నవారిని ఆదుకోవడంలో తెలుగుదేశం పార్టీ అగ్రభాగాన వుంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నాడు. విహార యాత్రకు వెళ్లి నేపాల్ అల్లర్లలో చిక్కుకుని అనంతపురం చేరుకున్న మల్లికార్జున, శశికళ దంపతులను శుక్రవారం ఆయన పరామర్శించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ విపత్తులు వచ్చినా, లేకుంటే ప్రజలు ఆ॑దల్లో వున్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుండి ఆదుకోవడం అదుకోవడం అభినందనీయమ న్నా రు. ఈ తరహాలో తనయుడైన నారాలోకేష్ ఇటీవల నేపాల్‌లో చోటుచేసుకున్న అల్లర్లలో ఇరుక్కుపోయిన రాష్ట్ర వాసులను ప్రత్యేక చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు అక్కడ పరిస్థితులను సమీక్షిస్తూ బిక్కు బిక్కుమంటూ తలదాచుకుని సహాయం కోసం ఎదురుచూస్తున్న వారిని ప్రత్యేక విమానాల ద్వారా రాష్ట్రానికి తరలించిన విషయం తెలిసిందేనన్నాడు. అంతేకాకుండా బాధితరులు విమానాశ్రయాలనుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి వారి స్వస్థలాలకు చేర్చడం అభినందనీయమన్నాడు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌లు దంపతులకు మిఠాయిలు తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు. దంపతులు మాట్లాడుతూ తాము ఏమిచేయలేని నిస్సాహాయ స్థితిలో వున్నపుడు మాకు ప్రభుత్వం ఆదుకుని మళ్లీ మా స్వస్థలాలకు తీసుకురావడం ఎంతో అభినందనీయమని, తాము ఎపుడు మంత్రి నారాలోకేష్‌కు రుణపడి వుంటామన్నారు. అనంతరం మంత్రి నారాలోకేష్ చిత్రపటానికి బాధితులు, ఎమ్మెల్యే తదితరులు పాలాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.


అభివృద్ధి దిశగా కదిరిదేవరపల్లి రైల్వే స్టేషన్

అర్హులందరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేస్తాం

ప్రతి పేదవాడి ఆరోగ్యానికి అండగా ప్రభుత్వం ఉంది

4 >>


# పెద్దారెడ్డి ఇంటి పరిసరాల్లో సర్వే..!

- మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకు సర్వే నిర్వహణ
- సర్వే తీరును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి
- ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో బందోబస్తు



రెవెన్యూ, సర్వే అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



సీఐతో సర్వే తీరును పరిశీలించమంటున్న పెద్దారెడ్డి



పెద్దారెడ్డి ఇంటి వద్ద పోలీసుల సమక్షంలో సర్వే చేస్తున్న అధికారులు

**తాడిపత్రి, సెప్టెంబరు 12, ప్రభాతవార్త :**

తాడిపత్రి మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం మేరకు రెవెన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులు శుక్రవారం వాటర్‌ట్యాంక్ వీధిలోని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి పరిసరాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించారు. సర్వే నంబరు 639, 640, 641లలోని ఎల్‌పీ నం.151-83కు సంబంధించిన ఫ్లాట్ నంబర్లు 2, 15ల లోని స్థలాన్ని కేతిరెడ్డి పెద్దారెడ్డి తన భార్య కేతిరెడ్డి రమాదేవి పేరున 2020లో కొనుగోలు చేసి ఆ తర్వాత ఇళ్లు నిర్మించారు. ఏప్రెల్ 2021లో అప్పటి మున్సిపాలిటి పట్టణ సర్వేయర్ 2, 15 ఫ్లాట్లలోని స్థల విస్తీర్ణం 577.55 చ.గ.లు(11.93 సెంట్లు) ఉన్నట్లు నిర్ధారించడంతో సదరు స్థలం పరిధిలోనే తాము ఇంటిని నిర్మించుకున్నామని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అధికారులతో పేర్కొన్నారు. అయితే ఆయన ఇంటికి ఉత్తరం వైపున ఆరు బయలుగా ఉన్న ఫ్లాట్ నంబర్లు 1, 16లలోని విస్తీర్ణం తక్కువగా ఉందని, సదరు స్థలం కొలతలు ఎల్‌పీ నం. 151-83లో సూచించిన మాదిరిగా ఉండేలా సర్వే చేయాలని ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి కోరిందని అధికారులు ఆయనకు వివరించారు. ఆ మేరకు 1 నుంచి 16 ఫ్లాట్లను సర్వే చేసి మున్సిపల్ బయలు స్థలం ఉండాల్సిన మేరకు ఉందా లేదా అని నిర్ధారించాలని కౌన్సిల్ కోరడంతో శుక్రవారం తహసీల్దార్ సోమశేఖర్, పట్టణ ప్రణాళిక అధికారిణి సుజాత, ఏడీ నాగరాజు, మున్సిపాలిటీ సర్వేయర్ కౌసల్య సాయి, మండల సర్వేయర్ రామమోహన్‌ల ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహించారు. ఈ సర్వే విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తిమ్మంపల్లి నుంచి 11.30 గంటలకు తాడిపత్రిలోని తన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్వే అనంతరం అధికారులు మీడియాతో మాట్లాడుతూ రికార్డుల్లో ఉన్న కొలతల మేరకు సర్వే నిర్వహించామని, కొంత తేడా ఉన్నట్లు తమ పరిశీలనలో తేలిందని తెలిపారు. తమ సర్వే నివేదికను ఉన్నతాధికారులకు, కోర్టుకు సమర్పిస్తామని టీపీవో తెలిపారు. అనంతరం సర్వే అధికారులు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డితో ఆమోదయోగ్యం కోసం సంతకాలు చేయాలని కోరగా ఆయన సదరు సర్వే తనకు ఆమోదయోగ్యంగా లేదని సంతకాలు చేయడానికి నిరాకరించడంతో వారు వెనుదిరిగారు. దీంతో సర్వే ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లైంది.

# వైసిపి నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డి గుండెపోటుతో మృతి

- పలువురు వైసీపీ,టీడీపీ, కాంగ్రెస్ నేతలు, అభిమానులు సంతాపం - రేపు అంత్యక్రియలు



తోపుదుర్తి భాస్కర్ రెడ్డి (ఫైల్ ఫోటో)

**అనంతపురం, సెప్టెంబర్ 12, (ప్రభాతవార్త బ్యూరో)**

అనంతపురం జిల్లా వైసీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డి (70) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. పదవులకు దూరంగా పార్టీలో అజాతశత్రువుగా , పార్టీ కార్యకర్తలు, అభిమానులతో ఎంతో ఆప్యాయతగా మాట్లాడేవారని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ అభిమానులు వ్యక్తం చేస్తున్నారు . ఆత్మకూరు మండలం తోపుదుర్తి స్వగ్రామంలో వ్యవసాయ తోటకు వెళ్లినప్పుడు గుండెపోటు వచ్చినట్లు, అనంతపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి వైద్య పరీక్షలు కోసం తీసుకొచ్చేసరికి చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. భాస్కర్ రెడ్డికి భార్య తోపుదుర్తి కవిత ( అనంతపురం మాజి జెడ్పీ చైర్మన్ ) కుమారుడు ప్రబంధ రెడ్డి, కుమార్తె కావ్య ఉన్నారు. డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు తోపుదుర్తి ఆత్మ రామిరెడ్డి స్వయంగా చిన్నాన్న అవుతారు. తోపుదుర్తి ఆత్మ రామిరెడ్డి, ఆయన సతీమణి, ఇతర కుటుంబ సభ్యులు కూడా విషాదంలో మునిగిపోయారు. స్థానిక రామచంద్ర నగర్ లో స్వగృహం లో ఉంచిన తోపుదుర్తి భాస్కర్ రెడ్డి మృతదేహానికి రాజకీయాలకు అతీతంగా పరువురూ నేతలు నివాళులర్పించారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, మాజీ మంత్రి శమంతకమణి,మాజీ ఎంపీ తలారి రంగయ్య,మాజీ ఎమ్మెల్యేలు జేసీ ప్రభాకర్ రెడ్డి, వై విశ్వేశ్వర్ రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఏడీసీసి బ్యాంకు మాజీ అధ్యక్షులు కోనారెడ్డి, శివ శంకర్ రెడ్డి, రజక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ చాకలి రంగన్న, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వై మధుసూదన్ రెడ్డి. వైసీపీ జిల్లా నాయకులు బి.ఎర్రి స్వామి రెడ్డి, చవ్వ రాజశేఖర్ రెడ్డి, నల్లపురెడ్డి, కె.వి రమణ, అనంతపురం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ లు విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి , అడ్వకేట్ హరినాద్ రెడ్డి, నార్పల సత్యనారాయణ రెడ్డి, ఫయాజ్, సుధాకర్ రెడ్డి, జయచంద్ర నాయుడు, వీరాంజనేయులు తదితర నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. విషాదంలో మాజీ జెడ్పీ చైర్మన్ తోపుదుర్తి కవిత.... తన భర్త చనిపోవడంతో మాజీ జెడ్పీ చైర్మన్ తోపుదుర్తి కవితను ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. వ్యవసాయం అంటే ఎంతో ఇష్టమని రోజు తోటకు కెళ్ళి ఆనందంగా గడిపేవారు చీనీ కాయలు తెంపే పని మిగిలి ఉందంటూ శుక్రవారం ఉదయం తోట కెళ్ళిన మా ఆయన నాకు తోడు లేకుండా గుండెపోటుతో మృత్యువాత పడ్డారని తోపుదుర్తి కవిత కన్నీళ్లు పెట్టుకుంటూ తమ ఆప్తులతో బాధను పంచుకున్నారు. అదేవిధంగా తన ఆప్త మిత్రుడు తోపుదుర్తి భాస్కర్ రెడ్డి చనిపోవడంతో మాజీ ఎంపీ,వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి దుఃఖ సాగరంలో ఉండిపోయారు.. భాస్కర్ రెడ్డితో తనకున్న అనుబంధాన్ని నెమరేసుకుంటూ, పార్టీకి కలిసికట్టుగా చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకుంటూ ఆయన విషాదంలో ఉండిపోయారు. భాస్కర్ రెడ్డి తండ్రి దివంగత తోపుదుర్తి రామచంద్రారెడ్డి ( మాజీ సమితి ప్రెసిడెంట్), అనంత వెంకట్రాం రెడ్డి తండ్రి మాజీ ఎంపీ అనంత వెంకట్ రెడ్డి ఇద్దరు స్నేహితులు. ఆ తర్వాత అనంత వెంకట్రామిరెడ్డి , తోపుదుర్తి భాస్కర్ రెడ్డి మంచి స్నేహితులుగా కొనసాగుతూ వచ్చారు అని చెప్పవచ్చు. తోపుదుర్తి భాస్కర్ రెడ్డి మృతదేహానికి పలువురు వైసిపి, టిడిపి, కాంగ్రెస్, ఇతర పార్టీ నాయకులు, అభిమానులు తరలివచ్చి నివాళులర్పించారు. ఆత్మకూరు మండలం లోని వివిధ గ్రామాల నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జెడ్పీ చైర్‌పర్సన్‌గా 2005 నుంచి పూర్తి కాలం తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి సతీమణి తోపుదుర్తి కవితమ్మ పనిచేశారు. అప్పట్లో దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా కొనసాగారూ.. కవిత జడ్పీ చైర్మన్గా ఉన్నప్పుడు అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా జిల్లా పరిషత్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు నడిచేందుకు అప్పట్లో తోపుదుర్తి భాస్కర్ రెడ్డి వ్యవహరించిన తీరును పలువురు కొనియాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలం కొనసాగిన తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి.వైఎస్ఆర్‌సీపీ ఆవిర్భావం తర్వాత వైఎస్ జగన్ వెంట తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి దంపతులు నడిచారు.. టిడిపి ఆవిర్భావం తర్వాత 1983లో కాంగ్రెస్ తరపున ఆత్మకూరు మండలాధ్యక్షుడుగా తోపుదుర్తి భాస్కర్ రెడ్డి ఎన్నికయ్యారు.. దివంగత నేత మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి సూర్యప్రసాద్ కూడా అదే సమయంలో ఎల్లనూరు మండలాధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆ ఒక్క పదవి మినహా తోపుదుర్తి భాస్కర్ రెడ్డి ఏ పదవిలో లేడని, పదవి కోసం ఎప్పుడు పోటీ పడలేదని చెప్పవచ్చు. తోపుదుర్తి కవిత జడ్పీ చైర్మన్ గా ఎంపిక చేసే విషయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా మంత్రిగా ఉన్న సీనియర్ నేత జేసీ దివాకర్ రెడ్డి కూడా కీలకంగా పనిచేశారు.కాగా అనంతపురం జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు తోపుదుర్తి భాస్కర్ రెడ్డి మృతి పట్ల తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.... పార్టీలకు అతీతంగా అందర్నీ ఆప్యాయంగా పలకరించే భాస్కర్ రెడ్డి మృతి అనంత రాజకీయాలలో దురదృష్టకరమైన రోజుగా జేసీ ఒక ప్రకటనలో అభివర్ణించారు... తోపుదుర్తి భాస్కర్ రెడ్డి మృతికి వైఎస్ జగన్ సంతాపం... మా పార్టీకి చెందిన అనంతపురం జిల్లా సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి ఆకస్మిక మరణం దిగ్భ్రాంతికి గురి చేసింది. క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పార్టీకి ఆయన అందించిన సేవలు మరిచిపోలేనివి. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు దేవుడు ధైర్యం ప్రసాదించాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను అని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.. ఇదేవిధంగా పలువురు అనంతపురం జిల్లా నాయకులు కూడా వేరువేరు ప్రకటనలలో సంతాపం వ్యక్తం చేశారు.








నివాళులర్పించిన ప్రముఖ నాయకులు

# తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

- సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు.?
- పలువురు సభ్యుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి,హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

**లేపాక్షి, సెప్టెంబర్ 12 ప్రభాతవార**

మండల కేంద్రమైన లేపాక్షి వెలుగు కార్యాలయంలో ఎంపిపి వెంకటరత్నమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. అధికారుల నివేదికల సమర్పణతో మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సర్పంచులు, కార్యదర్శులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులు, ఇతర వ్యాధుల పట్ల సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపిడిఒ నరసింహమూర్తి సమావేశాన్ని ప్రారంభించారు. మండల ఉపాధ్యక్షుడు అంజనరెడ్డి ఎంపిడిఒను అడ్డుకొని మండల పరిషత్ నిధులు అన్ని పంచాయతీలకు సమానంగా ఖర్చు చేయాలని ఎంపిడిఒను నిలదీశారు. దీంతో ఎంపిడిఒ ఈ విషయాన్ని తరువాత చర్చిద్దామని మాట దాట వేయడం జరిగింది. అనంతరం మండల వ్యవసాయాధికారి శ్రీలత మాట్లాడుతూ యూరియాపై నివేదిక చదువుతుండగా ఒక్కో రైతుకు ఒక్కో బ్యాగు యూరియాను కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని సభ్యులు ఏఒను నిలదీశారు. అనంతరం ఆర్ఐ ప్రమీల, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ దివ్య, మండల విద్యాధికారి నాగరాజులు తమ నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించని మండల సర్వసభ్య సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. గత మండల సమావేశంలో చర్చించిన సమస్యలను ఏమి చేశారని నిలదీశారు. మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాల్సి వుండగా పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడం పట్ల సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ అధికారులు గ్రామాల్లో చేపట్టిన పనులను వివరించాల్సి వుండగా వారు కిమ్మనకుండా కూర్చుండిపోయారు. ఎంపిడిఒ అన్ని శాఖల అధికారులను పిలిచి నివేదికలను సభ్యులకు తెలియజేయాల్సి వుంది. అయితే సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించిన 20 నిమిషాలకే పూర్తి చేయడం పట్ల ఎంపిటిసిలు, సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఎంపిపితో పాటు వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు సమావేశ మందిరం నుండి బయటకు వెళ్లిపోయారు.

# రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్ కు ఘన సన్మానం



మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్ కు సన్మానించిన కౌసర్ నగర్ మసీదు మత పెద్దలు.

**మడకశిర టౌన్ సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గా మడకశిర పట్టణానికి చెందిన భక్తర్ ను కూటమి ప్రభుత్వం నియమించడంతో శుక్రవారం పట్టణంలోని ఒకటవ వార్డు శివాపురం కౌసర్ మసీదు మత పెద్దలు మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ భక్తర్ కు పూల మాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు . అనంతరం భక్తర్ తో పాటు వచ్చిన మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు, కౌన్సిలర్ ఉమా శంకర్, మార్కెట్ డైరెక్టర్ ఫయాజ్ ,పట్టణ అధ్యక్షుడు నాగరాజు, పట్టణ కార్యదర్శి తిమ్మరాజు, లకు కౌసర్ మసీదు ముతవల్లిలు అజ్మతుల్లా,ముస్తఫా .మాజి కో ఆప్షన్ మెంబర్ రహంతుల్లా, మత పెద్దలు తదితరులు అందరూ కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ భక్తర్ మాట్లాడుతూ: కూటమి ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించినందుకు సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు,ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ఎంపీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జిల్లా మైనార్టీ పెద్దలకు, పట్టణంలోని మైనార్టీ మత పెద్దలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మైనార్టీ మత పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# గోరంట్ల మెయిన్‌రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థకు శ్రీకారం

- రూ.30 లక్షల నిధులతో పనులు ప్రారంభించిన మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి
- సమస్యను గుర్తించి స్పందించిన మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు...టిడిపి నేత, కాంట్రాక్టర్ చింతా రామచంద్రారెడ్డి



పనులను ప్రారంభిస్తున్న మండల కన్వీనర్

**గోరంట్ల, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

గోరంట్ల పట్టణంలోని ట్రెండ్స్ షాపింగ్ మాల్ వద్ద నుండి చింతా రామచంద్రారెడ్డి ఇంటి వరకు ప్రధాన రహదారిలో ఆ ప్రాంత ప్రజల అభ్యర్థన మేరకు మంత్రి సవితమ్మ ఆదేశాలతో నూతన డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, హస్తకళల కార్పోరేషన్ స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి, మాజీ సర్పంచు నిమ్మల చంద్రశేఖర్, పులేరు నరేష్, నిమ్మల శ్రీధర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తిరుపాల్, సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, రవిమోహన్, నిడిమామిడప్ప, నాగేనాయక్, ఉమాశంకర్, ఉమర్‌ఖాన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు దేవాంగం శ్రీనివాసులు, రవీంద్రనాయక్, అమర్, టిడిపి నేత కాంట్రాక్టర్ చింతా రామచంద్రారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి ప్రధాన రహదారుల్లో ఎన్నో కమర్షియల్ భవనాలు నిర్మించబడి ఉన్నాయని వాటికి తోడు గృహ నిర్మాణాలు సైతం రోజురోజుకు పెరుగుతున్నాయని అయితే సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని భావించిన మంత్రి సవితమ్మ 30 లక్షల నిధులతో నూతన డ్రైనేజీ నిర్మాణానికి ముందుకొచ్చారని ఆ పనులను సైతం టిడిపి నేత రామచంద్రారెడ్డి చేపడతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతా విక్రమ్‌సింహారెడ్డి, పసుపులేటి శ్రీనివాసులు, గిరిధర్‌గౌడ్, మల్లాపల్లి మహమ్మద్‌అజంతుల్లా, హాసేన్‌ఖాన్, కురుబ మల్లికార్జున, షామీర్‌బాష, హేమసుందర్‌రెడ్డి, సర్పంచు వినోద్, నరసింహమూర్తి, జయరాం, నబిరసూల్, వార్డ్ మెంబర్ లక్ష్మి నాగరాజు, మహేంద్ర, హరి, వెంకటేష్, మెడికల్ స్టోర్ శ్రీనివాసులు, గట్టు చంద్రశేఖర్‌రెడ్డి, పాలసముద్రం మనోహర, వాల్మీకి సోమశేఖర్, వాల్మీకి నాగమణి, చంద్రారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ ప్రభుత్వ హయాంలో బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కార్పోరేషన్లకు పంగనామాలు

- తెలుగుదేశం హయాంలో బిసి, కాపు, మైనార్టీ కార్పోరేషన్ల పునరుద్దరణ
- నిరుద్యోగ యువతి యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు కానీ ఆర్థిక సాయం అందించడం మరిచారు

**అగళి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపు, బ్రాహ్మణ, వైశ్య కార్పొరేషన్లు బాగా పని చేశాయి. ఆ కార్పోరేషన్ల కింద ఉన్న నిరుద్యోగ యువతీ యువకులను వేలాది మందికి ప్రభుత్వం చేయూత నిచ్చింది. వారి స్వయం శక్తితో ఎదగాలన్న ఉద్దేశ్యంతో చేతి వృత్తులు, అప్పడాల తయారీ, ఊరగాయల తయారీ, బిడిల తయారీ, పూలు కట్టడం, చిన్న బంకులను నడపడం, హోటళ్లను నడపడం, కిరాణా షాపులు నడపడం, చేతి వృత్తులను ఆదుకోవడానికి ఈ కార్పోరేషన్ల ద్వారా ప్రభుత్వం చేయూతనం దించింది. వైఎస్ఆర్‌సిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కార్పోరేషన్లను తుంగలో తొక్కింది. ఐదేళ్లపాటు బిసి, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, కాపు, వైశ్య బ్రాహ్మణ కార్పోరేషన్లకు నిధులు విడుదల చేయక ఆ కార్పోరేషన్లను పూర్తిగా తుంగలో తొక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే బిసి, ఎస్టీ, కాపు, మైనార్టీ కార్పోరేషన్లలో నిరుద్యోగ యువతీ యువకులను చేతి వృత్తుల వారికి చేయూతనివ్వడానికి దరఖాస్తులను అధికారులు స్వీకరించి నెలలు గడుస్తోంది. దరఖాస్తు చేసుకోవడానికి 500 నుంచి 1000 వరకు దరఖాస్తు దారుడు ఖర్చు పెట్టుకున్నాడు. కార్పోరేషన్ల ద్వారా సాయం అందుతుందని ఎదురు చూస్తున్నారు కానీ ఇంత వరకు కూటమి ప్రభుత్వం తీసుకున్న దరఖాసులకు పైసా విదల్చలేదు. ప్రాసెస్ మాత్రం పూర్తి చేశారు. ఎస్సీ, బ్రాహ్మణ కార్పోర్షేన్ల ద్వారా దరఖాస్తు తీసుకోవాలని ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. తీసుకున్న దరఖాస్తులకు అతీగతి లేదని దరఖాస్తు చేసుకున్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కార్పోరేషన్ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని ఈ కార్పోరేషన్లు యదావిధిగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ యువతీయువకులు కోరుతున్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఆగిన వర్షపు నీరుని తొలగించండి

- ఆగిన వర్షపు నీటిలో ప్రయాణికులుకు తప్పని తిప్పలు



వర్షపు నీటితో నిండిన రైల్వే అండర్ బ్రిడ్జి

**చెన్నేకొత్తపల్లి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

చేనే న్కొత్తపల్లి మండల పరిధిలోని గొల్లవాండ్ల పల్లి దగ్గర ఉన్నా రైల్వే అండర్ బ్రిడ్జ్ కింద వర్షం నీటిని తొలగించండి అని అటుగా వెళ్తున్న ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. నీరు నిల్వ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వర్షం పడి రెండు రోజులు అయినా కూడా ఇంతవరకు వర్షపు నీటిని తొలగించలేదు. కొన్ని పల్లెలు వారు నిత్యం ధర్మవరం వాహనాలలో ప్రయాణం సాగిస్తూ ఉంటారు, వర్షం వచ్చిన వెంటనే నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు మోటర్‌ను ఏర్పాటు చేశారు. గత మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి బ్రిడ్జ్ కింద వర్షపునీరు చేరి ఉండటంతో వాహన చోదకులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు ఎక్కువగా ఉన్నప్పుడు కొందరు తొందరగా టూ వీలర్‌తో వెళ్ళే సమయంలో నిలువ ఉన్న వర్షపు నీరు ఇంజన్ లోకి చేరడంతో ద్విచక్ర వాహనాలు ఆటోలు చెడిపోవడం జరుగుతున్నది. ప్రయాణం చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ఎప్పటి కప్పుడు మోటారు పంపుతో నీటిని తొలగించాలని ప్రజలు కోరు కొంటున్నారు.

# సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించండి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

**రామగిరి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త**

గ్రామాలలో తాగునీరు, స్థానిక సమస్యలు అధికారుల దృష్టికి వచ్చినప్పుడు వెంటనే వాటిని పరిష్కరించాలని ఎంపిడిఓ బాలకృష్ణుడు, ఎంపిపి క్రెన్నలు తెలిపారు. శుక్రవారం రామగిరి మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన ఎంపిడిఓ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో అధికారులు వారి ప్రగతి నివేదికలను గ్రామాలలో నెలకొన్న చిన్నచిన్న సమస్యలను తెలియజేశారు. అయితే సమస్యలు ఉన్న చోట వెంటనే అధికారులు సమన్వయంతో ముందుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా ఏవైనా పరిష్కరించడానికి కాని నిధులు సమస్యలంటే ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామన్నారు. ఈ సమావేశంలో వైస్ఎంపిపి సంపత్‌కుమార్, ఎంపిటిసి శ్రీనివాసులు, ఎంఈఓ శ్రీనివాసులు, వెటర్నరీ డాక్టర్ స్వర్ణలత, ఏపిఓ శంకర్, ఏఈఓ షరీఫ్ పాల్గొన్నారు.

# రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు తొలగింపు




రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

**రామగిరి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**

రామగిరి కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించే కార్యక్రమాన్ని టిడిపి నాయకులు చేపట్టారు. రాప్తాడు ఎ మ్మెల్యే పరిటాల సునీత సూచనల మేరకు కంపచెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాల్లో కంప చెట్లు ఏపుగా పెరగడంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో స్పందించి ఎమ్మెల్యే పరిటాల సునీత పనులు చేయించి శుభ్రం చేయించాలని ఆదేశించారు. దీంతో కాలనీ మొత్తం రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించారు.

# వాహన మిత్ర షెడ్యూల్ ను సద్వినియోగం చేసుకోండి

**అమరాపురం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**



హరీష్ కుమార్

మండలంలోని ఆటో డ్రైవర్లు వాహన మిత్ర పథకమునకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం షెడ్యూల్ను విడుదల చేసినట్లు అమరాపురం మేజర్ పంచాయతీ టిడిపి ఉపాధ్యక్షులు జి బి హరీష్ కుమార్ తెలిపారు.కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దసరా కానుకగా వాహన మిత్ర పథకం కింద 15000 వేలు అందజేయడం జరుగుతుంది కాబట్టి మడకశిర నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సహకారంతో లబ్ధి పొందాలని ఆయన కోరారు. అర్హత కలిగిన ఆటో డ్రైవర్లు తమ పరిధిలో వచ్చే సచివాలయంలో వారి వివరాలు అందజేయాలని ఆయన కోరారు.

# క్రీడల్లో చూపించే పోరాట స్ఫూర్తి.. జీవితంలో కూడా చూపించాలి

- బాల్ బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో పరిటాల శ్రీరామ్ రామాపురంలో అట్టహాసంగా బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో పరిటాల శ్రీరామ్

**బత్తలపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

క్రీడల్లో మీరు చూపించే పోరాట స్ఫూర్తి.. జీవితంలో ఎదురయ్యే సవాళ్ల విషయంలో కూడా చూపించాలని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం బత్తలపల్లి మండలం రామాపురం ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో అంతర్ జిల్లాల జూనియర్ బాల బాలికల 10వ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభ మయ్యాయి. ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఈ పోటీలను పరిటాల శ్రీరామ్ తో పాటు ఇతర ప్రముఖులు ప్రారంభించారు. ముందుగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు అద్భుతంగా మార్చ్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ఇక్కడకొచ్చిన క్రీడాకారులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ చూస్తే.. వారికి దీనిపై ఎంత ఆసక్తి ఉందో అర్థమవుతోందన్నారు. ప్రతి ఒక్కరూ పోటీలో గెలుపొందడానికి వందశాతం ప్రయత్నం చేయాలన్నారు. కానీ గెలుపు వస్తే పొంగిపోకూడదని.. ఓటమి వస్తే కుంగిపోకూడదన్నారు. చదువుల పోటీ ప్రపంచంలో మిమ్మల్ని క్రీడల వైపు వచ్చేలా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. పీఈటీలు మిమ్మల్ని సొంత బిడ్డల్లా చూసుకుంటూ మీరు సాధించే విజయాలను వారి విజయంగా భావిస్తారన్నారు. మీకు వచ్చిన ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకొని రాణించాలన్నారు. ఈ పోటీలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను శ్రీరామ్ అభినందించారు.

# శాశ్వత పరిష్కారం కోసం ఆర్డీవోకు వినతి



ఆర్డీవో సువర్ణకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

**బుక్కపట్నం, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

బుక్కపట్నం చెరువు లకు సంబంధించి కాలువ పనులు చేయడానికి శాశ్వత పరిష్కారం చేయాలని ఆ గ్రామ రైతులు సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు దేవిశెట్టి సంజీవ రాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో సువర్ణకు వినతిపత్రం సమర్పించారు. బుక్కపట్నం లోని రెండు కాలువలు పూడిక తీత పనులు జరిపేటప్పుడు రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువకు ఇరువైపులా ఉన్న గృహస్తులు చెత్తాచెదారంతో పాటు మురుగు నీటిని కాలువల్లోకి వదులుతున్నారన్నారు. దీంతో పనులు చేసే వారికి దుర్వాసన వెదజల్లుతూ కాలువ పూడికతీత పనులను చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ పూడికతీత పనులకు, మరమ్మతు పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలు రైతులు పాల్గొన్నారు.

# కోటిని పరామర్శించిన పరిటాల శ్రీరామ్

**బత్తలపల్లి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త**



కోటిని పరామర్శిస్తున్న పరిటాల శ్రీరామ్

భాజాపా నేత బత్తలపల్లి మండల కేంద్రానికి చెందిన కోటి సూర్య ప్రకాష్ బాబు ప్రమాదవశాత్తు కాలు విరిగి ఆసుపత్రిలో చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించిన ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ చార్జ్ పరిటాల శ్రీరామ్. శుక్రవారం ఓటింగ్ నివాసానికి వెళ్లిన పరిటాల శ్రీరామ్ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, జడ్పిటిసి కోటీ సుధ తదితరులు ఉన్నారు.

# ధూమపానానికి దూరంగా ఉండండి




ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**తాడిమర్రి సెప్టెంబర్ 12 (ప్రభాతవార్త)**

ప్రజల ఆరోగ్యాన్ని జీవితాన్ని కాల్చివేసి మాడ్చి మసి చేసే ధూమపానానికి యువత బానిస కాకుండా దూరంగా ఉండాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు యువతకు సందేశం ఇచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ధూమపానానికి వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారిలో ఉన్న షాపుల వద్దకు వెళ్లి యువతను పెడదారి పట్టించే పొగాకు, తంబాకు, సిగరెట్, వంటి పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు కృష్ణమోహన్, వెంకటేష్ తో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా కిష్టప్ప

**తాడిమర్రి సెప్టెంబర్ 12 ( ప్రభాతవార్త)**



కిష్టప్ప

తాడిమర్రి మండల ఇన్చార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా కిష్టప్ప నియమితులయ్యారు. తాడిమర్రి డిప్యూటీ ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న విజయ్ శేఖర్ నాయుడు అనారోగ్య కారణంగా సెలవుపై వెళ్లడంతో బత్తలపల్లి మండల డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కిష్టప్పను ఉన్నతాధికారులు తాడిమర్రి కి ఇన్చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి డిప్యూటీ ఎంపీడీవో కిష్టప్ప మాట్లాడుతూ ఎంపీడీవో వెంకట రంగారావు మరియు స్థానిక అధికారులు ప్రజాప్రతినిధుల సూచనలు సలహాలతో మండల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిది చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

**పుట్టపర్తి టౌన్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించి ఆ ఇంటికి పెద్ద కొడుకుగా అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పల్లె రఘునాథ్ రెడ్డిలు పేర్కొన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గానికి చెందిన సుమారు 24 మందికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా రూ. 24లక్షల 12వేల 816 ల ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి పల్లె మాట్లాడుతూ వివిధ కారణాలతో జబ్బు సోకిన మనిషి ఆ జబ్బు నయం చేసుకోవడానికి లక్షలాది రూపాయలను ఆసుపత్రులకు వెచ్చించి ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎం సహాయ నిధి ద్వారా ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సహాయాన్ని అందించి అలాంటి పేదలను ఆదుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 15మాసాల్లో పుట్టపర్తి నియోజకవర్గానికి మొత్తం 112 మంది పేదలకు సుమారు 1కోటి 27 లక్షల 96 వేల 420 లను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక చెక్కులను అందజేసినట్లు వారు వెల్లడించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలు,అభిమానుల తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

- రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు


**పుట్టపర్తి టౌన్, సెప్టెంబర్12, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పర్చాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు పిలుపుమేరకు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు నామాల శంకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బీసీ నాయకులంతా కలిసి పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం బీసికుల జనగణన చేసి జనాభా దామాషా నిష్పత్తి ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో 33 రిజర్వేషన్ కల్పించాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు మాట్లాడుతూ బీసీల కుల గణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఈ జిల్లాలో బీసీ వర్గానికి చెందిన ఇద్దరు మంత్రులు సవిత, సత్యకుమార్ లు ఉన్నా కూడా బీసీల అభివృద్ధి, సాధికారత కోసం అరకొరగా తూతూ మంత్రంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు నామాల శంకర్,జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కుమ్మరి వెంకటరమణ, ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షులు గిర్రాజు రవి, పట్టణ అధ్యక్షులు బండి వెంకటేష్,ఉపాధ్యక్షులు గోగుల రవి, బిసి నాయకులు సామకోటి ఆదినారాయణ, శంకర, చంద్రశేఖర్,పల్లా నవీన్ కుమార్ పాల్గొన్నారు.

చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో

# హెచ్ .ఐ.వి ఎయిడ్స్ పై అవగాహన

**తాడిమర్రి సెప్టెంబర్ 12 (ప్రభాతవార్త)**



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్ఐవి పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ. ఈ. సి క్యాంపెయిన్ యొక్క ఉద్దేశం గురించి డీ.ఆర్.పి రమేష్ యాదవ్ మాట్లాడుతూ హెచ్ ఐ వి ఎయిడ్స్, సుఖవ్యాధులు, క్షయ వ్యాధి మాదక ద్రవ్యాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హెచ్ ఐ వి/ఎయిడ్స్ ఎలా సోకుతుంది సోకకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. హెచ్ ఐ వి /ఎయిడ్స్ రోగుల పట్లచిన్న చూపు వివక్షత లేకుండా సమాజం లో కలిసి జీవించాలి హెచ్ ఐ వి ఎయిడ్స్ క్షయ వ్యాధి సంబందం గురించి అవగాహతో వ్యవహరించాలని అన్నారు..అలాగే కళాశాల ప్రిన్సిపాల్ మదుసూదన్ రెడ్డి మాదక ద్రవ్యాలపైన అవగాహన కల్పించారు. జోనల్ సూపర్వైజర్ శ్రీరాములు మాట్లాడుతూ హెచ్ ఐ వి గురించి మరింత సమాచారం కోసం 1097 టోల్ ఫ్రీ నంబర్ కి ఫోన్ చేసి సలహాలు సూచనలు తెలుసు కోవచ్చు అని అన్నారు.ఈ కార్య క్రమం లోజూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మదుసుదన్ రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ పోతులయ్య,లింక్ వర్కర్ ఆనంద్ ,కళాశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# ఏపీ ఎన్ జి జి వో సంఘం సమావేశాన్ని జయప్రదం చేయండి

**పుట్టపర్తి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త**

సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో నిర్వహించే ఏపీ ఎన్ జి జి వో సంఘం సమావేశాన్ని జయప్రదం చేయాలని పుట్టపర్తి తాలూకా ఏపీ ఎన్ జి జి వో సంఘం అధ్యక్షులు లింగా రామ్ మోహన్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 16వ తేదీన పుట్టపర్తి లోని మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న ఆర్.వి. జానకి రామయ్య కళ్యాణ మండపం నందు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఎన్ జి జి వో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఆలపర్తి విద్యాసాగర్ రావు, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి.వి.రమణ లు పాల్గొంటున్నట్లు ఆయన తెలియజేశారు. కావున శ్రీ సత్యసాయి జిల్లాలో వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఈ సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## అనంతపురం జిల్లా కేంద్ర గ్రంధాలయం నందు గ్రంధాలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

జిఓ ఆర్‌టి నెంబర్ 508, తేది 19-06-2004 రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు గ్రంధాలయ అభివృద్ధి కోసం గ్రంధాలయ అభివృద్ధి కమిటిని ఏర్పాటు చేయడమైందని జిల్లా కేంద్ర గ్రంధాలయం డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న తెలిపారు. ఈ కమిటీ నందు వివిధ వర్గాలకు చెందిన వ్యక్తులను అనగా ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు అ ధ్యాపకులు, ఆచార్యులు, సంఘ సేవకులు గ్రంధాలయ అభివృద్ధికి పాటు పడే వ్యక్తులను నియమించుకొనే విధంగా ఏర్పాటు చేయడమైనది. డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న కన్వీనర్ వ్యవహరించే ఈ కమిటీ నందు సభ్యులు గా రవికాంత్ కేటరింగ్ శ్రీ రమణ గారు, ప్ర్భ కళాశాల అధ్యాపకులు శ్రీమతి డాక్టర్ బృందా మేడమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గారు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి అవార్డు గ్రహీత శ్రీరాములు గారు, కవి రచయిత డాక్టర్ రామలింగయ్య గారు, రిటైర్డ్ ఎక్సయిస్ దీక్షి హరి గారు, రిటైర్డ్ టీచర్ రామారత్నం గారు, సుంకర రమేష్ గారు టౌన్ బ్యాంకు డైరెక్టర్ మొదలగు వారిని ఎంపిక చేయడమైనది. భవిష్యత్తులో మరి కొంత మందితో విస్తరి స్తామని తెలియచేయడమైనది. ఈ సందర్భంగా హాజరైన సభ్యులు మాట్లాడుతూ.. గ్రంధాలయ అభివృద్ధికి అన్ని రకములుగా సహకరించి అభి వృద్ధికి పాటుపడతామని తెలిపారు. ఈ కార్యక్రమం నందు సహా గ్రంధాల యాధికారి దాసరి గోవిందు, గ్రంధ:పాలకులు వై ప్రతాప్‌రెడ్డి, రవి కుమార్ నాయుడు, జయ రాం,విజ యభాస్కర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## తోపుదుర్తి భాస్కర్ రెడ్డి ఆకస్మిక మృతి

### - మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దిగ్భ్రాంతి

రాప్తాడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

వైయస్సార్సీపి సీనియర్ నాయకులు, తోపుదుర్తి భాస్కర్ రెడ్డి ఆకస్మిక మృతి పట్ల రాప్తా డు మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దిగ్భ్రాంతి చెందారు. శుక్రవారం మధ్యాహ్నం తోపుదుర్తి భాస్కర్ రెడ్డి పొలంలో పనులు చేయిస్తూ ఆకస్మికంగా కళ్ళు తిరిగి పడిపోవడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలియజేశారు. సమాచారం అందుకున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బంధువులకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. చిన్నాన్న తోపుదుర్తి భాస్కర్ రెడ్డి మృతి పట్ల తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సంతాపం తెలియజేశారు.

## బుక్కరాయసముద్రం లో సర్వసభ్య సమావేశం



మాట్లడుతున్న ఎంపీపీ సునీత



హాజరైయిన ప్రజాప్రతినిధులు వివిదశాకల అదికారులు

బుక్కరాయసముద్రం, సెప్టెంబర్ 12 ప్రబాతవార్త

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు.ఈ సమావేశం ఎంపీపీ దాసరి సునీత అద్యక్షతనన నిర్వహించారు.ఈ సమావేవంలో వ్యవసాయం,ఉద్యానశాఖ ,జాతీయుపాధి హామీపథకం,విద్య,వైద్యం, తాగు నీరు, విద్యుత్,వెలుగు,గృహనిర్మాణం, భూమి సమస్యలు, ఐసిడిఎస్, మండలంలో జరుగుచున్న వివిద అభివృద్దిపనుల తోపాటు వివిదశాఖల పనితీరు పై సమీక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీతతోపాటు వైస్ ఎంపీపీ రామ్ గోపాల్,తహశీల్దార్ శ్రీధరుమూర్తి,డిప్యూటీ ఎంపీడిఓ సదాశివా,హౌసింగ్ ఎఇ రామ్‌మూర్తి,ఎపిఓ సుజాత,ఉద్యానశాఖ అధికారి శైలజ,ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ నాగేంద్ర,వైద్యాదికారి స్వాతిలక్ష్మితోపాటు సర్పంచులు పసులూరు గ్రామ సర్పంచు కల్పనారెడ్డి,గోవిందపల్లి సర్పంచు రాములమ్మ,వసంతకుమార్,నాగార్జున,తోపాటు ఎంపీటీసీలు,సర్పంచులు వివిదశాఖల అధికారులు తదితిరులు పాల్గొన్నారు.

## సెలవుల తేదీలను మార్చండి

### - గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గుజ్జల శివయ్య, డేగావత్ రవీంద్రనాథ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

రాష్ట్ర విద్యా క్యాలెండర్ ప్రకారం సెలవులు 24 నుంచి ఇస్తున్నారు. కానీ పండుగ 22న ప్రారంభమవుతుంది కాబట్టి ఆ రోజు నుంచే సెలవులు ఇవ్వాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గుజ్జల శివయ్య, డేగావత్ రవీంద్రనాథ్ ప్రభుతనికి కోరారు. దసరా వేడుకలు, దేవీ నవరాత్రులు, బతుకమ్మ ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. నవరాత్రి చివరలో వచ్చే ఈ పర్వదినం, దేశంలోని హిందువుల అతిపెద్ద పండుగలలో ఒకటి. ప్రతి సంవత్సరం దసరా తేదీ మారుతుంది. 2025 దసరా తేదీ తెలుగు క్యాలెండర్ ప్రకారం, దసరా పండుగ ఆశ్వయుజ మాసంలో వస్తుంది. అశ్వయుజ శుక్లపక్ష దశమినే విజయ దశమిగా జరుపుకుంటారు. ఈ ఏడాది ఈ పర్వదినం అక్టోబర్ 2న వచ్చింది. దసరా నవరాత్రులు 2025 సెప్టెంబర్ 22 నుంచి మొదలై, అక్టోబర్ 2న విజయ దశమితో ముగుస్తాయి. దసరా నవరాత్రులు సెప్టెంబర్ 22 వ తేదీ నుంచే మొదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రోజు నుంచే స్కూళ్లకు సెలవులు ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## జాతీయస్థాయి వన్ డే కాన్ఫరెన్స్ ఇన్నోవేషన్ ఫ్రంటైర్ 2025 కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

ఎస్.వి.డిగ్రీ, పి.జి.కళాశాలలో అక్టోబర్ 15న జరగబోయే జాతీయస్థాయి వన్ డే కాన్ఫరెన్స్ ఇన్నోవేషన్ ఫ్రంటైర్ 2025కు సంబంధించిన కరపత్రాలను కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి శుక్రవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ఉన్న విశ్వ విద్యాల యాలు, కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని సాంకేతిక విజ్ఞానం, బయోటెక్నాలజీ, ఫుడ్ సైన్స్, కెమిస్ట్రీ రంగాలలో జరుగుతున్న తాజా పరిణామాలను పంచుకోవచ్చని తెలి పారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్‌ఏవి ప్రసాద్ మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు తమ ప్రతిభను ప్రదర్శిం చడానికి, పరిశోధన ఫలితాలను వినిమయం చేసుకోవడానికి గొప్ప అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏఓ శ్రీనాథ్, బయో టెక్నాలజీ విభాగాధిపతి డా. రిజ్వానా బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం




ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

యల్లనూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

బాల్య వివాహాలు చట్టరీత్యానేరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి.రాజమణి పేర్కొన్నారు. సంకల్ప కార్యక్రమం ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని చిలమకూరు ఏపి మోడల్ స్కూల్, జెసి కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రాజమణి మాట్లాడుతూ అమ్మాయిలకు ప్రభుత్వం నిర్దేశించిన 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలలోపు వివాహం చేయకూడదన్నారు. ఈ వయసులో విద్య ప్రాముఖ్యమైనదన్నారు. బాల్యవివాహాలు చేసుకుంటే వాటి వల్ల జరిగే పరిణామాలు, అనారోగ్యం, వత్తిడిలకు లోనవుతారని పలు విషయాలను తెలియచేశారు. అనంతరం ఏఎన్ఎం కాశీరాణి రక్తహీనత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు ఎం.విజయలక్ష్మి, సి.వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌వి సుప్రియ, ఆశా వర్కర్ రామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిర్మూలన-బాలల రక్షణ చట్టాలపై అవగాహన



అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం బాలల రక్షణ చట్టాలపై అవగాహన కల్పిద్దాం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను అనుసరించి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమీల ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది నాగలక్ష్మి, ప్రొటెక్షన్ ఆఫీసర్ లక్ష్మి ప్రసన్న కనగానపల్లి మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వాణి, కస్తూరిబా గాంధీ పాఠశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ రమాదేవి ఆధ్వర్యంలో స్థానిక మహిళా పోలీస్ వరలక్ష్మితో కలిసి పిల్లలకు బాల్య వివాహ చట్టం, లైంగిక వేధింపుల నుండి రక్షణ కల్పించు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్ధాలు ముఖ్యంగా ఆర్థిక సమస్యలు, అమ్మాయిలకు ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, సామాజికపరంగా ఎదురయ్యే సమస్యలు, అమలు అవుతున్న చట్టాలు, రక్షణ వ్యవస్థల గురించి అవగాహన కల్పించారు. కస్తూరి బా పాఠశా లలో చదువుతున్న 270 మంది విద్యార్థులకు సఖి గ్రూపులు ఏర్పాటు ముఖ్య ఉద్దేశా లను తెలియపరిచారు. చివరగా విద్యా ర్థినిలచేత బాల్య వివాహ నిర్మూలనపై ఒక ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినిలు ఇన్చార్జి ప్రిన్సి పల్ రమాదేవి, మహిళా పోలీస్ వరలక్ష్మి, డిసిపియు సిబ్బంది నాగలక్ష్మి, ప్రసన్న లక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుల ఆత్మీయ సన్మానం



ఉపాధ్యాయులతో ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

ఎపి పిఇటి అండ్ ఎస్ఎ పిఇ సంఘం అధ్యక్షులు ఆర్‌సి.అక్కులప్ప ఆధ్వర్యంలో అనంతపురం ఉపాధ్యాయ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా జిల్లాలో మొట్టమొదటిసారిగా 11 మంది స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వారు ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపిక కావ డం జరిగింది. అందువలన ఎపి పిఇటి అండ్ ఎస్ఎ పిఇ సంఘం ఆధ్వ ర్యంలో శుక్రవారం జరిగినటువంటి ఉత్తమ ఉపాధ్యాయుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న శాసనసభ్యులు ప్రభు్వ విప్ కాలవ శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ రామకృష్ణ, ధానోపా ధ్యాయుల సంఘ అధ్యక్షులు జయరాం రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కాలవ శ్రీని వాసులు మాట్లాడుతూ..

ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని వారు పిల్లలకు డాక్టర్లుగా శారీరకం గాను మానసి కంగాను ఎంతో అభివృద్ధి చెంది రోగాల బారిన పడకుండా దోహద పడుతు న్నారని వారి యొక్క కృషికి ఫలితంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యా యులుగా 11 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఉత్తమ ఉపా ధ్యాయులుగా ఎంపిక చేయడం అభినంద నీ యం అని తెలియజే శారు. అ లాగే ప్రభుత్వం క్రీడలపై పెద్ద పీట వేస్తోంది అని విద్యాశా ఖ మంత్రి నారా లోకేష్‌తో క్రీడా సామాగ్రి గురించి చర్చించి త్వ రలోనే పాఠశాలకు వారికి అవసరమైన ప్రత్యేక క్రీడా సామాగ్రిని మంత్రి గారితో చర్చించి అందజేస్తామని తెలియ జేశారు. అలాగే డైట్ ప్రిన్సి పాల్ రామకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఎం తో అంకిత భావంతో పనిచేస్తు న్నారని ఈ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందడంతో వారికి మరింత బాధ్యత పెరిగిందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, సత్యనా రాయణ, శివకేశవులు, సుగుణమ్మ, శకుంతల, పార్వతి, నాగమణి, లింగమ య్య, సిరాజ్, కుమార్, వేణు, అధికసంఖ్యలో వ్యాయామ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విశేషంగా పాల్గొన్నారు.

## చెత్తాచెదారంతో నిండిపోయిన అంగన్వాడి కేంద్రం



చుట్టూ చెత్తా చెదారంతో అంగన్‌వాడీ కేంద్రం

నార్పల సెప్టెంబర్12, ప్రభాతవార్త

నార్పల మండల కేంద్రంలోని స్థానిక రెండో వార్డ్ ఎస్సీ కాలనీలో అంబేద్కర్ భవన్లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో చిన్నపాటి వర్షాలు వచ్చినా మురుగునీరు తో నిండిపోతుంది. ఆ మురుగునీరు రోజులపాటు అక్కడే నిలువ ఉండటంతో భారీగా దోమలు వ్యాపించి అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నపిల్లలకు కుట్టి అనారోగ్య సమస్యలు పాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ విషయం మీద పలుమార్లు అధికారులకు చెప్పిన స్థానిక ఎస్సీ కాలనీ వాసులు మాట్లాడుకుం టున్నారు. అంగన్వాడి కేంద్రం చుట్టూ మురుగు నీరు తో పాటు చెత్తాచెదారం,వ్యర్థ పదార్థాలు, వరద నీరులో కొట్టుకుంటున్న విష పదార్థాల వలన వచ్చే దుర్వాసన అధికంగా ఉంటుం ది.అంగన్వాడి కేంద్రానికి వచ్చే చిన్న పిల్లలు, బాలింతలు ఆ దుర్వాసన పీల్చడం వలన ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు చెప్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే అంగన్వాడి టీచర్ లలితమ్మకు మూడో ప్రపంచం యుద్ధం చేసినట్టు ఉంటుంది. చాలా కష్టపడుతూ పిల్లల్ని మురుగునీరు దాటించి అంగన్వాడి స్కూలుకి పిలుచుకొని విధులు నిర్వహిస్తూ ఉంటుంది. ఎస్సీ కాలనీ వాసులని పంచాయతీ అధికారు లకి పలుమార్లు చెప్పినా నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ మురుగునీరు చెత్తాచెదారం వలన దుర్వాసనతో అనారో గ్యాన బారిన పడి ప్రాణాలు కోల్పోతే కానీ పంచాయతీ అధికారులు పట్టిం చుకోరు అన్నట్టుగా ఉన్నారు. ఈ చెత్తాచెదారం నుండి వచ్చే దుర్వాసన వలన అంగన్వా డికి వచ్చే చిన్నపిల్లల తల్లిదండ్రు లు స్కూల్ కి వెళ్ళనీకుం డా ఉండటం విశేషం. అంబేద్కర్ భవనంలో మురికి నీరు కారణంగా సాయంత్రం వేళ యువత వ్యాయామాలు, వాలీబాల్ ఆడుకోవడం కూడా తగ్గిపో యిం ది. వర్షపు నీరు కాలువల గుండా ప్రవహిస్తే పెద్ద కాలువలోకి వెళ్తుంది. కాలువ డామేజ్ వలన చెత్తాచెదారంతో కలిసి మురుగునీరు అంబేద్కర్ పవన్ ఆవరణం చుట్టూ నిండుకుంటుంది. దయచేసి అధికారులు స్పందించి సమస్యను తొలగించాలని స్థానిక ఎస్సీ కాలనీ వాసులు కోరుకుంటున్నారు.

## ఆర్డిటిని కాపాడుకుందాం..మహాధర్నా కార్యక్రమం



మహాధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ఆర్డిటిని కాపాడుకుందాం ఎఫ్‌సిఆర్‌ఏ సాధించుకుందాం మహా ధర్నా కార్యక్రమంలో ఏపీ ఎంఆర్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు మాట్లాడుతూ.. ఆర్డిటి సమస్త బడుగు బలహీన పేద కుటుంబాలకు ఎంతో సహాయ సహకారాలు అందిస్తూ విద్యా వైద్య ఆరోగ్య మహిళా వ్యవసాయ కళాకారుల క్రీడారంగం వికలాంగులు మానసిక వికలాంగులు వివిధ రకాలుగా సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ రెన్యువల్ చేయకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. అదే విధంగా జిల్లా శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల విచ్చేసిన మహిళలకు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ డిఆర్‌ఓ గారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్, ఎస్సీ ఎస్టీ కుల సంఘాలు వివిధ ప్రజా సంఘాలు నాయకులు చామలూరు రాజగోపాల్ కేపీ నారాయణస్వామి చిన్న పెద్దన్న రాచేపల్లి రామంజి మద్దలచెరువు మల్లీ స్మామాట్ మధు ఆదిశేషు చిరంజీవి శ్యామల బాల పెద్దన్న చిర్రాళ్ళ రామంజి తదితరు నాయకులు పాల్గొన్నారు.

## పులుసు వంక పారితే ప్రజలకు ఇబ్బందులే

### - ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలంటున్న ప్రజలు



నీటి ఉధృతిలోనే నడుస్తూ వెళ్తున్న స్కూల్ విద్యార్థులు



నీటిలోనే ద్విచక్ర వాహనాన్ని నడుపుకుంటూ వస్తున్న వాహన దారుడు

శింగనమల, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

మండల పరిధిలోని తరిమెల గ్రామ సమీపాన ఉన్న పులుసు వంక 11వ తేదిన కురిసిన భారీ వర్షానికి పెద్ద ఎత్తున పారడంతో తరిమెల గ్రామానికి వెళ్లే ప్రజలు, అధికారులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. వర్షం వచ్చినప్పుడల్లా ద్విచక్ర వాహణదారులు, విద్యార్థులు పులుసు వంక దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కోసారి ప్రాణాలు ఫణంగా పెట్టి దాటేందుకు ప్రయత్నిస్తుండటంతో ఏదైనా జరగరానిది జరిగితే తీవ్ర విషాదం తప్పదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పులుసు వంకపై వెంటనే బ్రిడ్జి నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు.

## వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే అనుమతి

### - ధన్యవాదాలు తెలిపిన వడ్డే ఓబన్న జెఏసికి సభ్యులు



ఎమ్మెల్యేను కలిసి వినతి చేస్తున్న వడ్డే ఓబన్న జెఏసి సభ్యులు

అనంతపురం సెప్టెంబరు 12 ప్రభాతవార్త

జిల్లా కేంద్రంలో వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటకు స్థలం కేటాయించాలని వడ్డే ఓబన్న జెఏసి సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ విగ్రహం ఏర్పాట్లు చేసుకోవాలని తాను నిర్మాణ శంకుస్థాపనకు వస్తానని హామీ ఇవ్వడం పట్ల వడ్డేఓబన్న జెఏసి సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో జెఏసి సభ్యులు మల్లెల జయరాం, వడ్డే గోపాలకృష్ణ, కుంచపు వెంకటేశులు, వి.కె.గంగన్న, డాక్టర్ కొల్లాయప్ప, న్యాయవాదులు మూర్తి, జరిపిటి నంది, టైలర్ వెంకటేష్, గంగాధర్, ముత్తన వెంకటరాముడు, మంజుల, నారాయణ,పల్లపు సూర్యప్రకాష్, నెట్టికంటి గోగుల రామకృష్ణ, పీట్ల రవీంద్ర, వల్లపు కృష్ణ,వల్లపు వేణు, గోగుల ధను, కుంచపు సూర్యనారాయణ, ఉప్పు శ్రీనివాసు, వడ్డే ఘని, దళవాయిరాము, కొట్టాలపల్లి సుధాకర్, చంద్ర, ఆలకుంట రాజా తదితరులు వున్నారు.

## గ్రామాల్లో విద్యుత్ సమస్య లేకుండా చేస్తాం

### డిఈ రవిశంకర్



రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ డిఈ రవిశంకర్

ఆత్మకూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

ఆత్మకూరు మండలంలోని గ్రామాల్లో ఆర్‌డిఎస్ పథకం ద్వారా విద్యుత్ సమస్యలు లేకుండా చేస్తామని, డిఈ రవిశంకర్ తెలిపారు.శుక్రవారం మండల పరిధిలోని పి.సిద్దరాం పురంలో డి,ఈ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్,డి,ఎస్ పథకం ద్వారా కొత్త విద్యుత్ లైన్.కొత్త పోల్స్‌వేసి 24 గంటలు త్రీఫేస్ కరెంట్ ఉండేటట్లు చేస్తున్నామని, దీంతో గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉండవని అనంతపురం రూరల్ డిఈ రవిశంకర్ తెలిపారు.ఎం,ఎం,హళ్ళి గ్రామానికి కొద్ది రోజుల్లో సపరేట్ ఫీడర్‌ను లాగి రైతులకు సమస్య లేకుండా చేస్తామన్నారు.గృహాలకు వినియో గించేవారు ఎక్కువ లోడు ఉంటే ఇప్పుడు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ందని తక్కువ మొత్తంలో అదనపులోడును మార్చుకోవచ్చు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సోలార్ పథకంను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు తెలియజేశారు.పలు సమస్యలపై రైతులతో ముచ్చటిం చారు.ఈ కార్యక్రమంలో ఏఈ దాసు,హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతి నిధి శశాంక్‌బాబు,లైన్ ఇన్స్పెక్టర్ ఫక్రుద్దీన్,విద్యుత్ శాఖ సిబ్బంది,రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వైసీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి మృతి



తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి ( ఫైల్ ఫోటో)

ఆత్మకూరు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆత్మకూరు మండల మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి ఆకస్మిక మరణం మండల ప్రజలకు దిగ్భ్రాంతికి గురి చేసింది. శుక్రవారం గుండెపో టుకు గురై మరణించడంతో ఆత్మకూరు మండల ప్రజలు తీవ్ర ఆవేదన చెం దారు. క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పార్టీకి ఆయన అందించిన సేవలు మరచి పోలేనివని,మండల అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఆత్మకూరు మండల అభి వృద్ధి కి హర్నిశల కృషి చేశారని అతని సేవలను మండల ప్రజలు గుర్తు చేసుకు న్నారు.ఆయన మృతి మండల ప్రజలకు తీరనిలోటని, మండల ప్రజలకు, వైసీపీ పార్టీకి ఆయన అందించిన సేవలు మరచిపోలేనివన్నారు. ఆయన ఆత్మ కు శాంతి చేకూరాలని మండల ప్రజలు ప్రార్థిస్తూ,సంతాపం వ్యక్తంచేశారు.

## ఈ నెల 15న ఆర్డిటిని కాపాడుకుందాం కార్యక్రమానికి తరలిరండి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డిటి సంస్థను కాపాడటానికి సోమవారం టవర్ క్లాక్ నుండి జిల్లా కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్ళటానికి వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పిఎస్ దాస్, డివిఎంపి సభ్యులు మనవి చేశారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ.. "హలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఎస్సీ, ఎస్టీ మైనారిటీ నిరుపేద వర్గాల ప్రజలారా ! ఈ నెల 15 సోమవారం టవర్ క్లాక్ దగ్గర ఉన్న ఆర్ట్స్ కాలేజ్ మైదానం నుండి వేలాది మంది ర్యాలీగా వెళ్ళి ఆర్డిటి సంస్థకు రెన్యువల్ చేయాలని " జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం అందచేయటానికి వేలాదిగా తరలి రావాలన్నారు.

## రైతులకు ఎరువుల సరఫరా



ఎరువులను సరఫరా చేస్తున్న వ్యవసాయ అధికారులు

రాప్తాడు, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

రాప్తాడు మండలంలోని ప్రసన్న యపల్లి ఆర్ఎస్‌కె, రాప్తాడు ఫెడరేషన్ ఎఫ్‌పిఓ షాపులకు యూరియా ఇతర ఎరువుల సరఫరా చేయడం జరిగింది. శుక్రవారం ప్రసన్నా యపల్లి గ్రామంలో రైతులకు ఇ పిఓఎస్ మిషన్ ద్వారా బయోమెట్రిక్ విధానంలో యూరియా ఇతర ఎరువులు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎస్.కృష్ణ చైతన్య, ఎఇఓ సుజిత, ఆర్ఎస్‌కె ఇన్‌చార్జ్‌లు సోనియా, రైతులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



: చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

నియోజకవర్గ వ్యాప్తంగా పేదలకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ 38,72, 876 రూపాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద డబ్బులు మంజూరు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పేదలను ఆర్థికంగా ఆదుకుంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థులకు ఎయిడ్స్‌పై నివారణ..నియంత్రణపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.కవిత

శింగనమల, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎయిడ్స్‌పై విద్యార్థులకు ఐఇసి క్యాంపెన్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్‌వారి ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెన్ ఉద్దేశ్యం గురించి శింగనమల సిహెచ్‌సి కౌన్సిలర్ వెంకటపతి, కళాశాల ప్రిన్సిపాల్ జి.కవితలు మాట్లాడుతూ.. హెచ్‌ఐవి. సుఖవ్యాధులు, క్షయవ్యాధి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలపైన అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్షత చూపకుండా సమానంగా కలిసి జీవించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు సుప్రియ, చంద్రశేఖర్, ఎలిజిబిట్ గౌసియా భాను, శ్యామల, సతీష్‌కుమార్, ఖాజీపీర, చాంద్‌బాషా, లింకు వర్కర్స్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**IN THE COURT OF THE Ist ADDL. DISTRICT JUDGE, ANANTAPURAMU**
**E.P.NO: 485/2024 IN A.C.P. (CNICA-FIVE-STAR) No. 159 of 2023**

***Between:***
M/S. Five Star Business Finance Limited, Chennai, Represented by its Authorized Signatory, G.Giddaiah.
..Petitioner/ D.Hr

And

M.Padmavathi,and Others
...Respondant/J.Dr

**Notice to the J.Dr No1**

Mrs. M.Padmavathi, W/o M. Ram Mohan Reddy,, H. No. 3-4, Malilla, Kunta Palli, (Village), Obuladevara, ODC, Anantapur Dist. Now at Sri Satya Sai Dist.

పై నెంబరు కేసులో 1వ జె.డి.ఆర్. అయిన మీ హాజరు నిమిత్తం 10-10-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

**M.SURESH KUMAR, Advocate**
**Ananthapuramu. Cell:9441168233**

